## ఆనంద్‌గల్లీ రహదారికి మరమ్మతులు చేపట్టాలి

చార్మినార్, మే 2 ప్రభాతవార్త : ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌గల్లీకి చెందిన రహదారి గుంతలు మయంగా మారటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్డుపై కంకర రాళ్లు తేలి ఉండటంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతు న్నారు. ఖమ్మర్ హోటల్ నుంచి ఆనంద్‌గల్లీ రహదారి మీదుగా చార్మి నార్, గుల్జారాహౌస్, చార్‌కమాన్, పటేల్ మార్కెట్, మదీనాతో పాటు పలు ప్రాంతాలకు వందలాది వాహనాలు నడుస్తుంటాయి. కాగా రోడ్డంతా చెడి పోవటంతో గుంతలలో నడిచి వెళ్లే సమయంలో ప్రజలు ప్రమాదవశాత్తు గుంతలలో జారి పడి గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళ్లలో చీకటిలో వాహనదారులు ఆనంద్‌గల్లీ రోడ్డు మీదుగా ప్రయాణం



చేయాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆనంద్‌గల్లీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆనంద్‌గల్లీ రహదారి గుంతలు మయంగా మారినప్పటి చిత్రం



హైదరాబాద్ వార్త

# మరో కన్నపేగు గోస

**వైఫల్యం ఎవరిదీ?**

**మొన్న కళాసిగూడలో చిన్నారి మౌనిక మరువకముందే.. నీటి గుంతలో పడి జూబ్లీహిల్స్‌లో ఆరేళ్ల బాలుడు మృతి**

**జిహెచ్ఎంసి జలమండలి మధ్య సమన్వయ లోపం**

**చిన్నారులను మింగేస్తున్న నాలాలు, నీటి కుంటలు**

**నగరవాసులను బయపెడుతున్న వరుస ఘటనలు**

హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త : ఇటీవల నాలాలో పడి చిన్నారి మౌనిక చనిపోయిన సంగతి మరవకముందే మరో దారుణం జరిగింది. మంగళవారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో నీటి గుంతలో పడి ఆరేళ్ల బాలుడు వివేక్ మరణించాడు. స్నేహితులతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ గుంతలో పడి మునిగిపోయాడు. అక్కడికి దగ్గర్లోనే ఉన్న బాలుడి తల్లిదండ్రులు వచ్చి బయటకు తీసేలోగా ఊపిరి అందక కన్నుమూశాడు.

రోడ్డుపై నిలిచే వరద నీటిని తొలగించడం కోసం తీసిన గుంత ఈ ప్రమాదానికి కారణమైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గుంత నిండిపోయిందని, దానిపై ఉన్న కర్రమీదికి ఎక్కే ప్రయత్నంలో పట్టుతప్పి వివేక్ నీటి గుంత లో పడిపోయాడని తోటి పిల్లలు చెబుతు న్నారు. అక్కడికి దగ్గల్లోనే ఉన్న ఓ షోరూంలో వివేక్ తల్లిదండ్రులు పనిచేస్తారని సమాచారం. వివేక్ గుంతలో పడి పోయాడని పిల్లలు వచ్చి చెప్పడంతో బాలుడి తల్లిదండ్రులు పరుగెత్తుకెళ్లారు. గుంతలో నుంచి వివేక్‌ను బయటకు తీయగా అప్పటికే వివేక్‌లో చలనం ఆగిపోయిందని స్థానికులు తెలిపారు.



కన్నీరు మున్నీరవుతున్న బాలుడి తల్లి

జలమండలి, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో సామాన్యులు మృత్యువాతపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు, నాలాలు, డ్రైన్లు తవ్వి

**ఇటీవల జరగుతున్న పలు సంఘటనలతో నగర వాసులు బెంబేలెత్తి పోతున్నారు. వర్షాలు వస్తే ఎక్కడ నాలా నోరుతెరిచి ఉంటుందో.. ఎక్కడ నీటి గుంతల్లో పడిపోతామో అన్న భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.**

వదిలేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ఈ గుంతల్లో పడి అమాయకులు విగతజీవులుగా మారుతున్నారు. ఈ సందర్భాల్లో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి సంబంధిత అధికారులపై సస్పెన్షన్ వేటువేసి మమ అనిపిస్తున్నారు.



బాలుడు మృతిచెందిన గుంట, (ఇన్‌సెట్‌లో) స్ట్రెచర్‌పై బాలుడి మృతదేహం

- ఏప్రిల్ 29, శనివారం ఉదయం బేగంపేట, కళాసిగూడలో మౌనిక (7) అనే బాలికా నాలాలో పడి మృతిచెందింది.
- ఈ ఏడాది జనవరి 31న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో పనిచేసే కార్మికుడు దోమల నివారణ చర్యలు చేపడుతూ చిన్నతోకట్ట ప్రాంతంలో హస్మత్‌పేట చెరువు నాలాలో పడి చనిపోయాడు.
- సెప్టెంబరు 25, 2021 మణి కొండలో రాత్రి 9గంటలకు స్టాఫ్ట్‌వేర్ ఇంజినీరు రజినీకాంత్ నాలా కోసం తవ్విని గుంతలో పడ్డారు. మూడు కిలోమీట ర్లు కొట్టుకుపోయా నెక్నాంపూర్‌లో శవమైతేలాడు.
- జూన్2, 2021న బోయిన్‌పల్లి ఆనంద్ నగర్‌కాలనీకి చెందిన ఏడేళ్లబాలుడు ఓపెన్ నాలాలోపడి మృతిచెందాడు.
- సెప్టెంబరు 17, 2020న నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల సుమేధను నాలా బలి తీసుకుంది.
- నవంబరు 4, 2020న సరూర్‌నగర్‌లో కోదండరామ్ నగర్ వద్ద ఉదయం నడకకు వెళ్లిన ఓ వృద్ధురాలు, మరో ప్రాంతంలో ఇంకో వ్యక్తి నాలాలో పడి మృతిచెందాడు.
- సెప్టెంబరు 25, 2019న నాగోల్ నాలాలో పడి గుర్తుతెలియని వ్యక్తి చనిపోయాడు.
- సెప్టెంబరు 26, 2019న చైతన్యపురిలో ద్విచక్ర వాహనం వెళ్తున్న ఇద్దరు అర్చకులు నాలాలో పడి గల్లంతవగా, ఒకరు కొంత దూరంలో ఒడ్డుకు చేరుకున్నారు. మరొకరు చనిపోయారు.
- జనవరి 2018లో చందానగర్‌లో రెడ్డికాలనీకి చెందిన శివకుమార్ (4) నాలాలో పడి చనిపోయారు.
- జూన్ 10, 2018న ఓ గుర్తుతెలియని వ్యక్తి సత్యరాఘవేంద్రనగర్ కాలనీ ఓపెన్ నాలాలో పడి చనిపోయారు.
- సెప్టెంబరు 9, 2018న 24 ఏళ్ల హరీష్ సరూర్‌నగర్ నాలాలో పడి మృతిచెందారు.
- అక్టోబరు 16, 2018న బోరబండ సాయిబాబా ఆలయం వద్ద రాజయ్య అనే వ్యక్తి నాలాలో పడి చనిపోయారు.
- భారీ వర్షంలో గోల్నాకలో ఓ మహిళ తెరిచిఉన్న మ్యాన్‌హోల్‌లో పడి మూసినదిలో శవమై తేలింది.

## పనికావాలంటే..
# చేయి తడపాల్సిందే

**డబ్బులివ్వనిదే దస్త్రం కదలదు**

**ఇది ప్రభుత్వ కార్యాయాల్లో సిబ్బంది తీరు**

**ఎసిబి దాడుల్లో వెలుగులోకి అవినీతి జలగలు**

హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త: లబ్దిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం, ఇతర ప్రయోజనాలు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వందే దస్త్రం కదలని పరిస్థితి నెలకొంది. చేయి తడిపితేకానీ అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆస్తి బదలాయింపు, నల్లాకనెక్షన్, పవర్ కనెక్షన్, ఆకరికి పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు వర్తించాలన్నా విచారణధికారులు చేతులు తపడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. తాజాగా బోడుప్పల్ ట్రాన్స్‌కో ఎఇ ప్రసాద్‌బాబు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. చిన్నపాటి కాంట్రాక్ట్ పనులు చేసే నవీన్ నుండి పదివేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చిలుకానగర్ ప్రాంతంలో నవీన్ చిన్నపాటి కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. గతంలో అనేక సార్లు ఎఇకి లంచం ఇచ్చి పనులు చేసినట్లు పేర్కొన్నారు. చిలుకానగర్ ప్రాంతంలో ప్యానెల్ బోర్డు ఏర్పాటు కోసం నవీన్ నుండి ఎఇ ప్రసాద్ బాబు పదివేల రూపాయలు డిమాండ్ చేశారు. దీంతో నవీన్ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు మంగళవారం రోజు నవీన్ నుండి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బోడుప్పల్ ఎఇ కార్యాలయంతోపాటు మల్కాజిగిరిలోని అతని ఇంట్లో కూడా ఎసిబి అధికారులు సోదాలు చేశారు.



ఇలా నిత్యం వివిధ ప్రభుత్వశాఖల్లో అవినీతి జలగలు బయపటడుతూనే ఉన్నాయి. జిహెచ్ఎంసీ, వాటర్‌బోర్ట్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ఇలా అనేకశాఖల్లో అవినీతి తాండవిస్తోంది. తమపనులు చేసిపెట్టాలని వెళ్లిన లబ్దిదారులు డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది. పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన లబ్దిదారులు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారిపనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేయి తడిపితే మాత్రం అవసరమై ధ్రువపత్రాలు ఉన్నా లేకున్నా పనులు చకచకా చేసిపెడుతున్నారు. లంచావతారుల బెడద తప్పించడానికి ప్రభుత్వం పలురకాల ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు ప్రవేశపెట్టింది. అయితే ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునప్పటికి సంబంధిత విచారణాధికారిని కలువకపోతే ఆశించిన ప్రయోజనం అందుబాటులోకి రాకుండా పోతుంది. సదరు అధికారిని కలిసి ఎంతో కొంత ముట్టచెబితేనే సకాలంలో పనులయ్యేలా చూస్తున్నారు. వేలకు వేల రూపాయలు వేతనాలు రూపంలో పొందుతున్న అధికారుల దిగజారుడుతనం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

**కేసుల అంతంతమాత్రమే..**

అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) రెండు రకాల కేసులు నమోదు చేస్తుంది. అధికారులు ఎవరైనా పనులు చేయటానికి లంచాలు అడుగుతున్నట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు అందించేటప్పుడు వలపన్ని అధికారులను పట్టుకుంటారు. రెండోది.. ఆదాయానికి మించి ఆస్తులున్న వ్యాపారులు, అధికారులను సైతం ఇళ్లు, వారి వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి పట్టుకుంటారు. అయితే బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడక్కడ లంచావతారులను పట్టుకుంటున్న అధికారులు ఆదాయానికి మించి ఆస్తులున్నవారిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి వారిపై రహస్యంగా విచారణ జరిపి పట్టుకోవాల్సి ఉండగా ఇలాంటి కేసుల విషయంలో ఆసక్తి కనబరచడం లేదు. ప్రలు ప్రభుత్వశాఖల్లో లంచాలు పెరుగుతున్నా కేసులు మాత్రం పెరగటం లేదు. ఏసీబికి దొరికిన అధికారులు ఏదోఒక రాజకీయ నాయకుడి అండతో కొంతకాలంపాటు దూరప్రాంతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మళ్లీ పాతపాటే పాడుతున్నారు. కారణం అవినీతి నిరోధక శాఖ గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడమేనని తెలుస్తుంది. దీంతో ప్రతి ఏడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఏదోలా మనపని అయిపోయిందనే ధోరని కారణం వల్ల పలువురు ఫిర్యాదులు చేయడానికి ఆసక్తి కనబరచడం లేదు. ఈవిషయంలో ఉన్నతాధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

## బల్కంపేట ఎల్లమ్మ భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా
# అన్ని చర్యలు తీసుకుంటున్నాం : మంత్రి తలసాని



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, మే 2, ప్రభాతవార్త : బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బల్కంపేట ఆలయ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఆలయ పండితులు మంత్రికి కుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రమాణం చేయించారు. ఆలయ పరిసరాలలో తిరిగి అక్కడ జరగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. ప్రధానంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం ప్రభుత్వం నిధులే కాకుండా దాతల సమకారంతో కూడా భక్తులకోసం అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో అమ్మవారి కల్యాణాన్ని ఆలయం లోపల కొద్దిమంది భక్తుల మధ్య నిర్వహించే వారని అన్నారు. కానీ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తరువాత ఆలయం ముందు పెద్ద రేకుల షెడ్డును నిర్మించి వేలాది మంది భక్తుల సమక్షంలో కల్యాణాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సంవత్సరం జూన్ 20వ తేదీన అమ్మవారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా ఆలయం చుట్టూ ఆలయానికి వచ్చే అన్ని రహదారులను వాహనదారులు, భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అభివృద్ధి చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఆలయం ముందు చిరు వ్యాపారాలు చేసుకొంటున్న వారికోసం నూతనంగా షాప్‌లను నిర్మియంచడం జరిగిందని, వాటిని 4వ తేదీన ప్రారంభిస్తామని తెలిపారు. ఎలాంటి అద్దెల ఏకుండా కేటాయించడం జరుగుతుందని చెప్పారు. షాప్‌ల కేటాయింపులో ఎలాంటి విమర్శలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేసినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను అదేశించారు. దేవాలయానికి సంబంధించి షాపులను తీసుకున్న వారు సకాలంలో అద్దె చెల్లించే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని చోట్ల సిసి కెమెరాలను ఏర్పాటుచేయాలని అదేశించారు. అధికారులు, నూతన పాలక మండలి సభ్యులు సమన్వయంతో వ్యవహరించి ఆలయ అభివృద్ధి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మిబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ కృష్ణ, ఈఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేతో ఫిజికల్ బాలెన్సుతోపాటు మెంటల్ బ్యాలెన్సు : సినీ హిరో సుమన్

**సెప్టెంబర్ 9,10 తేదీల్లో కరాటే ఛాంపియన్‌షిప్**



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సుమన్, కరాటే రాజు తదితరులు

హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త: సెప్టెంబర్ 9,10 తేదీల్లో నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో నేషనల్ లెవల్ కరాటే ఛాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఛీఫ్ అడ్వైజర్ సి.రాజు తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీహీరో సుమన్ చేతుల మీదుగా కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ తాను ఇప్పటికే ఆరోగ్యంగా ఉన్నానంటే దానికి మార్షల్ ఆర్ట్స్ కారణం అన్నారు. ఇది నేర్చుకోవడం వల్ల ఫిజికల్ బాలెన్స్‌తోపాటు మెంటల్ బాలెన్స్ ఉంటుందన్నారు. జీవితం అంటేనే ఆట అని అందులో గెలుపోటములు సహజం అన్నారు. కరాటే రాజు మాట్లాడుతూ తాను 1987 నుంచి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్నానని ప్రపంచంలో ఎక్కడాలేని గౌరవం కరాటేలో దొరకుతుందన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

## శామీర్‌పేట రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం**

శామీర్‌పేట, మే 2, ప్రభాతవార్త : శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం సందర్భంగ ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ తరువాత అన్నదాన కార్యక్రమం జరిగింది. భారీ సంఖ్యలో భక్తజనం విచ్చేసి శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆ తరువాత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన దండకట్ల సురేశ్-జయంతి దంపతులు, కుమారుడు నిహాల్, కుమార్తె ప్రతీక వారి కుటుంబసభ్యులు (అన్నదాతలు) శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి ఆ తరువాత వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించటానికి వారు 15వేల రూపాయలు ఆలయ కమిటీ వారికి ముందుగా అందజేశారు. శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ తరపున అన్నదాన కార్యక్రమానికి చేయూత నిచ్చిన వారికి సభ్యులు దన్యవాదాలు తెలియజేశారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి వారికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పాల్గొన్నారు. శామీర్‌పేట గౌడ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ వారు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కస్టడీలో మృతి చెందిన చిరంజీవి కుటుంబానికి న్యాయం చేయాలి : వామపక్షాల డిమాండ్



అడ్డగుట్టలో పోలీస్ చర్యలకు నిరసనగా ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

అడ్డగుట్ట, మే 2 ప్రభాతవార్త: తుకారాంగేట్ పోలీస్ కస్టడీలో మృతి చెందిన చిరంజీవిది లాకప్‌డెత్ అని వామపక్ష పార్టీల నేతలు కాంపల్లి శ్రీనివాస్, యాదగిరి, రంజిత్ సింగ్, బాలనర్సింహ్మా, అజయ్‌బాబులు ఆరోపించారు. ఎల్బీనగర్‌కు చెందిన చిరంజీవిని దొంగతనం కేసులో వారం రోజుల క్రితం తీసుకువచ్చి చేయని నేరానికి ఒప్పుకో వాలని పోలీసుల దెబ్బలతోనే మృతి చెందాడని ఆరోపిం చారు. మంగళవారం అడ్డగుట్టలోని జీఎం అంజయ్య స్థూపం వద్ద పోలీసుల చర్యలకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసుల కస్టడీలో మృతి చెందిన చిరంజీవి కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చిరంజీవి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. చిరంజీవి మృతి కారణమైన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నర్సింగ్‌రావ్ (బిఎస్‌పి), పి.రమేశ్ (డి.హెచ్.పి.ఎస్), విష్ణువర్ధన్‌రెడ్డి (పౌరహక్కుల సంఘం), పాకాల యాదగిరి (సిపిఐ), బలరామ్ మాదిగ, వేణుగోపాల్ మాదిగ, నర్సింగ్ రావ్ మాదిగ (ఎమ్మార్పిఎస్) పాల్గొన్నారు.

# జలమండలి వద్ద బిజెపి మెరుపు ధర్నా.. ఉద్రిక్తత

**డ్రైనేజీల్లో పూడిక తీయడం లేదని ఆందోళన**

**కార్పొరేటర్లు, పోలీసులు మధ్య తీవ్ర వాగ్వాదం**

**అరెస్ట్ చేసిన పోలీస్ స్టేషన్‌కు తరలింపు**



జలమండలి వద్ద బిజెపి కార్పొరేటర్ల ధర్నా

హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త: జలమండలి కార్యాలయం వద్ద మంగళవారం బిజెపి కార్పొరేటర్లు చేపట్టిన మెరుపు ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. జిహెచ్ఎంసి, వాటర్‌బోర్డు అధికారుల సమన్వయ లోపం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. సీవరేజ్ నిర్వాహణలో పూర్తిగా విఫలమయ్యారని, డ్రైనేజీ పూడిక తీయేట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో సీవరేజ్ సిల్ట్ (చెత్త)ను తీసుకువచ్చి వాటర్‌బోర్డు కార్యాలయంలో పారబోశారు. ఈనేపథ్యంలో కార్యాలయానికి కార్పొరేటర్ల ఒక్కసారిగా దూసుకురావడం తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కార్పొరేటర్లు పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యాలయం నుంచి కార్పొరేటర్లను పోలీసులు బయటకు ఈడ్చుకొచ్చారు. ఈ క్రమంలో మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ తలకు గాయమైంది. పోలీసులు తనపై దాడి చేశారంటూ కార్పొరేటర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బిజెపి కార్పొరేటర్లు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించారు. కార్పొరేటర్లను అరెస్ట్ చేయడంతో పోలీసు వాహనాల ఎదుట మహిళా కార్పొరేటర్లు బైఠాయించారు. వారిని కూడా అరెస్ట్ చేసి అందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ.. నాలాల్లో పూడిక తీయడం లేదని, తీసిన పూడినకు తొలగించడం లేదని మండిపడ్డారు. తీసిన పూడిక సైతం వర్షాలకు మళ్లీ నాలాపై పడిపోతుందని ,అధికారుల సమన్వయ లోపంతో ప్రజాధనం వృధా అవుతుందన్నారు. గతంలో పలుమార్లు వాటర్‌బోర్డు తీరుపై జిహెచ్ఎంసి కౌన్సిల్‌లో నిలదీశామని, సమావేశానికి రాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యలను విన్నవించుకుందామని వస్తే అధికారులు పట్టించుకోవడం లేదని తాము ధర్నా చేస్తుంటే ఒక్క అధికారి కూడా బయటకు పిలిపించలేదన్నారు. పోలీసులు తమను దౌర్జన్యంగా అరెస్ట్ చేస్తున్నారంటూ కార్పొరేటర్లు మండిపడ్డారు. ఈసందర్భంగా బోర్డులో మొక్కల కుండీలను ధ్వంసం చేశారని వాటర్ బోర్డు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ధర్నాలో బిజెపి కార్పొరేటర్లు శ్రవణ్, అరుణ, నర్సింహ్మారెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, రవిచారి, శ్రీవాణి, పద్మావతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్రను కళ్లలకుకట్టిన
# 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' నృత్యరూపకం



కూచిపూడి నృత్య ప్రదర్శనల్లో ఓ దృశ్యం

రవీంద్రభారతి, మే 2 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ 14వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని డా. నందిని సిధారెడ్డి రచన, డిఎస్‌వి. శాస్త్రి సంగీతం, వ్యవపకురాలు, నాట్య గురువు ఇందిర పరాశరం నృత్యదర్శకత్వంలో సంస్థ శిష్యులచే అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన పలుఅంశాలతో కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన; కృష్ణ గోదావరి రెండు మహానదుల నడుమ విరాజిల్లు పవిత్రభూమి... గిరులతో, వనరులతో, వీరులతో పులకిరించిన నేల.. కలంతో, కళలతో, ఆయుధంతో జాతి వికసించిన భూమి... సిరసెత్తితేప చరిత్ర, సంస్కృతి.. ఈ నేలమీద జానపదకళలు, సంప్రాదాయ కళలు గజ్జకట్టి ఆడగా జైనం, బౌద్ధం, శైవం, ఇస్లాం, సూఫీ మత బోధనలు ఇనుమడించగా, రాళ్లకు నాట్యం నేర్పిన రాగం, ఈనేల పేరే త్యాగం, స్వేచ్ఛావిముక్తుల కోసమే జాతిజనుల జాతర, సాయుధ పోరాటాలు, సత్యాగ్రహాలతో స్వరాష్ట్ర సాధన. ఇలా తెలంగాణ వైభవం, గతచరిత్ర, గణచరిత్ర గానం 2000 సంవత్సరాల మహాచరిత్రకు దర్పణంగా ప్రదర్శింపబడిన నా తెలంగాణ కోటి రతనాల వీణ నృత్యరూపకం ఆద్యంతం ఎంతగానో ఆకట్టుకొంటూ యావత్ తెలంగాణ చరిత్రను కళ్లకుకట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథులు ఇందిర పరాశరం, సీతారామచార్యులు తదితరులతో కలిసి నాట్యగురువులు రమణి సిద్ధి, వెంకటనాగసాయి, స్వరూప, నాగస్వర్ణలకు లలితకళాస్రష్ట అవార్డులు, బొబ్బిలి శివాని, శ్రీహిత ప్రతాపలకు నాట్యదీపశిఖ బిరుదులు ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

## బిఆర్ఎస్‌తోనే కంటోన్మెంట్‌లో రోడ్ల ఓపెన్ : మర్రి రాజశేఖర్ రెడ్డి



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, మే 2 ప్రభాతవార్త: బిఆర్ఎస్ చేపట్టిన ఉద్యమాలతోనే కంటోన్మెంట్ ఆర్మీ,ఏఓసి సెంటర్లలో మూసి వేసిన రోడ్లను తిరిగి ఓపెన్ చేయడం జరిగిందని, అదే విధంగా ఉచిత మంచి నీటి పథకాన్ని ప్రవేశపెట్ట డం జరిగిందని మల్కాజిగిరి పార్ల మెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజ కవర్గం ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం 1వ వార్డు సౌజన్య కాలనీలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గంలో చేపట్టిన అవృద్ధి పనులు అమలైయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. సాయన్న అడుగు జాడల్లోనే బిఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందన్నారు. కంటోన్మెంట్‌లో ఆర్మీ ఏరియాలో మూసి వేసిన రోడ్లను తిరిగి ఓపెన్ చేయాలని మంత్రి కేటిఆర్ దృష్టికి తేవడంతో ఆయన సారధ్యంలోనే ఆర్మీ ఏరియాలోని 6 రోడ్లను తిరిగి తెరిపించుకున్న ఘనత బిఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 800 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదిత, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథ్,ప్రభాకర్, జయప్రకాశ్, నళిని కిరణ్, భాగ్యశ్రీ, బిఆర్ ఎస్ నాయకులు ఆనంద్ బాబు, ముప్పిడి మధుకర్, పిట్ల నాగేశ్, పెద్దాల నరి ్సంహ్మా, షర్విన్, కిరణ్, నాగినేని సరిత,ప్రవీణ్ యాదవ్, రాజు సింగ్, బత్తుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 4న ఎల్‌బి స్టేడియంలో 'నేషనల్ ప్రేయర్ డే'

### ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక సుసంపన్నత, సామాజికాభివృద్ధి, ఆర్థికా ఉద్ధరణ కోసం క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో 'నేషనల్ ప్రేయర్ డే' నిర్వహిస్తున్నామని తెలంగాణ క్రిస్టియన్స్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు చెప్పారు. మంగళవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా తమ సంస్థ విజయవంతంగా నేషనల్ ప్రేయర్ డేని నిర్వహిస్తున్నామని, అయితే గత రెండు సంవత్సరాల మహమ్మారి కరోనా కారణంగా నిర్వహించలేకపోయామని తెలిపారు. దేశం, రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న సిఎం కెసిఆర్, రాష్ట్ర మంత్రులు బాగుండాలని పెద్ద ఎత్తున ప్రార్థనలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రార్థనల్లో వివిధ ప్రాంతాల నుంచి పాస్టర్లు, బిషప్‌లు, ఫాదర్స్, రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొంటారని, క్రైస్తవులు ఈ ప్రార్ధనలలో పాల్గొని విజయవంతం చేయాలని రాజేశ్వర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, కార్యనిర్వాహణ కార్యదర్శి జోనాథన్, సిన్హా, రాయిడ్ అండ్ రోస్, టిఎన్ కుమార్, విద్యాసాగర్, యేసురాజు, అద్వర్డ్‌జోనర్థన్ తదితరులు పాల్గొన్నారు. వీరు నేషనల్ ప్రేయర్ డేకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## ఎమ్మెల్యే రాజీనామ చేస్తే రాజేంద్రనగర్ దళితులకు మేలు జరుగుతుంది

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్.. దళిత బంధులో రూ.3లక్షలు నొక్కేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



నార్సింగిలో దళితబంధుపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నార్సింగి, మే 2 ప్రభాతవార్త : ఎమ్మెల్యే రాజీనామ చేస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని దళితులకు మేలు జరుగుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో దళితబంధులో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వేలాది మంది దళితులుంటే కేవలం బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, బడా నేతల ఇళ్లల్లో పని చేసే వారికి వంద మందికి దళిత బంధు ఇచ్చారని, దీనిలో రూ.2లక్షలు ఎమ్మెల్యేకు, రూ.లక్ష అధికారులకు లంచాలు పోతున్నాయని ఆరోపించారు. గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో దళితులు లేరా? వీరి ఓట్లు ఎమ్మెల్యేకు అవసరం లేదా? ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈటెల రాజేంద్ర రాజీనామాతో దళితబంధును సిఎం కేసీఆర్ తీసుకువచ్చారని, అలాగే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే రాజీనామా చేస్తే సర్కారు లాక్కున్న భూములు, దళితబంధు అర్హులందరికి సీఎం కేసీఆర్ దిగివచ్చి తిరిగి ఇస్తారని తెలిపారు. అనంతరం గండిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ యాదవ్ మాట్లాడుతూ రైతుబంధు వందల ఎకరాలున్న వారికి ఇచ్చి ధనికులకే సీఎం కేసీఆర్ మేలు చేస్తున్నారన్నారు. 111.జీవో పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా 7,8.అంతస్థులలో ఇళ్లు నిర్మించుకొంటున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నేతలు కిరణ్, జగన్ మోహన్, బాల్‌రాజ్, సులోచన, అశోక్, నవీన్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్‌సాగర్ నాలా వరదనీటి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: హుస్సేన్ సాగర్ నాలా పరీవాహక ప్రాంతమైన గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్, సబర్మతినగర్ ప్రాంతాల్లో వరదనీటి సమస్యను పరిష్కరించే పనులను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ వివిధ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ శ్యామ్ సుందర్, సూపర్‌వైజర్ రవి సిబ్బందితో పాటు బిజెపి నగర నేత ఎ.వినయ కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. గతంలో ఏర్పాటు చేసిన చిన్నదారులు కాస్తా మట్టి, చెత్తతో మూసుకుపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరిందని అన్నారు. మట్టి, చెత్తను తొలగించి, నీళ్ళను సులువుగా మళ్ళించేందుకు దారులను పెద్దవిగా చేసి క్రమబద్ధీకరించే పనులు సాగుతున్నాయని కార్పొరేటర్ వివరించారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్,ఎం.ఉమేశ్, నవీన్‌కుమార్, జిడి.రాజు, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, బస్తీ సంఘం అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, చిప్స్‌రాజు, శ్రీను, ఏలియా, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌ప్లానింగ్ ఎసిపిగా మంజులా సింగ్ బాధ్యతల స్వీకరణ

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి సర్కిల్-15 ముషీరాబాద్ నియోజకవర్గం టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా బి.మంజులా సింగ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన పావనీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యుసుఫ్‌గూడ సర్కిల్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. గతంలో ఇదే సర్కిల్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం మంజులాసింగ్‌కు ఉంది. గతంలో పదోన్నతిపై ఏసీపీగా చార్మినార్ పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీగా పనిచేశారు. సాధారణ బదిలీలలో భాగంగా జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ ఆదేశాల మేరకు మంజులా సింగ్ ముషీరాబాద్‌కు ఏసీపీగా బాధ్యతలను స్వీకరించారు. సర్కిల్ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు తప్పనిసరిగా అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఏసీపీగా బాధ్యతలను స్వీకరించిన మంజులా సింగ్‌ను సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఘనంగా సత్కరించారు. అదే విధంగా బదిలీ అయిన పావనీలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు హఫీజ్, అనీల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లేఔట్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

### కట్టడాలను నిలిపివేయాలని విజ్ఞప్తి

ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మ ండలం చౌదరిగూడలోని అక్రమ లేఔట్‌లో జరుగుతున్న కట్టడాలపై ఎంపిటిసి, వార్డుసభ్యులు మేడ్చల్ జిల్లా కలెక్ట ర్‌కు ఫిర్యాదు చేశారు. చౌదరిగూడ సర్వేనంబర్ 714లో అక్రమంగా లేఔట్ చేసి హెచ్ఎండిఏ, గ్రామపంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతూ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. చనిపోయిన సర్పంచ్ మన్నెం రంగారెడ్డి సంతకం ఫోర్జరీ చేసి అక్రమ వెంచర్ చేశారని పార్కు స్థలం లేకుండా స్థలాలు అమ్మి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. సర్వేనంబర్ 714లో 4 ఎకరాల భూమిని 2000 సంవత్సరంలో కట్ట శంకరయ్య నుంచి శ్రీనివాస్‌గౌడ్, జి.విజయ్‌కుమార్‌రెడ్డి, టి.బాలరాజేశం, సిహెచ్.నరేందర్, వేణుగోపాల్‌యాదవ్‌లు జీపీఏ చేసుకున్నారు. అక్రమంగా లేఔట్ చేసి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి పులకంటి భాస్కర్‌రెడ్డి, వార్డుసభ్యులు కొంగరి శంకర్‌గౌడ్, రడమల్ల భోజిరెడ్డి, బండ్లగూడెం వాణి, మంద స్వామిదాస్, పసులాది నవ్య, పులకంటి సంయుక్త, పాలడుగు అరుంధతి, మంచాల సుధాకర్, కుర్ర స్వామి, బిలకంటి స్వాతిలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## కుక్కల బెడదతో పాదచారుల ఇక్కట్లు

ఖైరతాబాద్, మే 2 ప్రభాతవార్త: బస్తీల, కాలనీల పలు వీధుల్లో కుక్కల బెడద తీవ్రతరమై వచ్చే పోయే పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారి పలు ఇక్కట్లకు దారి తీస్తుంది. సంబంధిత యంత్రాంగం వాటిని పట్టుకోవడం, తిరిగి కొద్ది రోజులకు వదిలివేయడం కారణంగా కుక్కలు రెచ్చిపోతున్నాయి. ఖైరతాబాద్ మారుతి నగర్‌లోని కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మారుతినగర్ మార్గం మధ్యలో కుక్కలు వారిపై దాడి చేసేందుకు యత్నించాయి. కొంత కాలంగా అక్కడక్కడ ఇలాంటి పరిస్థితే ఎదురవుతుందని, పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వారు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందంటున్నారు.

## దళితుల సొమ్ము దోచుకున్న నేతల పేర్లు బయటపెట్టాలి : మేకల సారంగపాణి

సికింద్రాబాద్, మే 2 ప్రభాతవార్త : దళితబందులో కమిషన్లు దండుకున్న శాసనసభ్యుల పేర్లు, నాయకుల పేర్లు బయట పెట్టాలని, కమిషన్‌లు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. మధురా నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ దళితబంధు పేరుతో దళితులకు ఇస్తున్న పథకంలో కేవలం దళితులే ప్రయోజనం పొందాలి తప్ప కమిషన్ల పేరుతో దళారులు, నేతలు శాసనసభ్యులు ప్రయోజనం పొందడం సమంజసం కాదన్నారు. సమాజంలో దళితులు రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో అనేకమంది ఉన్నారని, వారినోర్లు కొట్టి సంపాదించుకోవడం నేతలు చేస్తున్న తప్పిదాలని అన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధును ప్రవేశపెట్టారని, ఇప్పుడు ఆయనే స్వయంగా శాసనసభ్యులు, నేతలు, దళారులు దళితుల సొమ్మును కమిషన్‌ల పేరుతో దోచుకున్నారని ప్రకటించారని తెలిపారు.

**అర్హులందరికి దక్కాలి..** దళితబంధు పథకం అర్హులైన వారందనికి దక్కాలని మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. కేవలం బీఆర్ఎస్ నేతలు, కార్యాకర్తలు, పార్టీకి పని చేసిన వారికి మాత్రమే ఇప్పటి వరకు దళితబంధు దక్కిందని చెప్పారు. నియోజకవర్గంలో కేవలం వంద, రెండు వందల మంది మాత్రమే దళితులు లేరని, కనీసం రెండుపూటలా తినడానికి లేనివారు అనేకమంది ఉన్నారని అన్నారు. న్యాయంగా వారికి మాత్రమే దళితబంధు దక్కాలన్నారు. అర్హులైన ప్రతి దళితుడికి ప్రభుత్వం దళితబంధును ఇవ్వాలని సారంగపాణి డిమాండ్ చేశారు. ప్రతి దళితుడికి పథకం అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో దళితులే బీఆర్ఎస్‌ను ఇంటిదారి పట్టిస్తారని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పాలాభిషేకం



పారిశుధ్య కార్మికులతో సంబురాలు జరుపుతున్న వెంకటేషన్ రాజు

సికింద్రాబాద్, మే 2 ప్రభాత వార్త: పారిశుధ్య కార్మికులు ప్రతి నెల పొందుతున్న జీతానికి తోడు మరో రూ. వెయ్యి అధనంగా అందజేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ మే డేను పురస్క రించుకొని ప్రకటించడం హర్షనీయ మని బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాద వ్ ఆదేశాల మేరకు బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో సంబురాలు జరుపుకు న్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పాలాభిషేకం జరిపారు. కార్మి కులకు స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వెంకటేషన్ రాజు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్య మంత్రి కేసీఆర్ కార్మికులు అడగకుండానే నాలుగు పర్యాయాలు జీతాలు పెంచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు వెంకటేషన్, గోవిందరాజ్, జాన్ సుందర్ పాల్గొన్నారు.

## ఆగస్టులోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం

మూసాపేట, మే 2, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండిగ్‌లో ఉన్న పనులను ఆగస్టులోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కార్పొరేటర్లు, జిహెచ్ఎంసి, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ఎక్కడైతే పెండిగ్‌లో రోడ్డు, డ్రైనేజి వ్యవస్థ ఉన్నాయో అవి వెంటనే పూర్తి చేయాలని దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు పక్కా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలులతో కరెంటు స్తంభాలపై చెట్లు కూలి విద్యుత్‌కి అంతరాయం కలుగుతున్న వేళ జిహెచ్ఎంసి విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా అలాగే ప్రజలకు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించేటట్లు సూచి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా డ్రైనేజి వ్యవస్థపై ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా మంత్రి కెటిఆర్‌కు తెలియజేస్తామని, దీనికి సంబంధించి ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవం

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: చిక్కడపల్లి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారపు రమేశ్, చేపూరి లక్ష్మణ్, కోశాధికారి చిట్టిమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఈ ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమం సంఘం అదనపు కార్యదర్శి టి.రవీందర్, ప్రొద్దుటూరి నర్సింహారావు పర్యవేక్షణలో జరిగింది. సంపూర్ణ పూస సామాగ్రి సంఘం ఏర్పాటు చేయగా పూజా కార్యక్రమం అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. చిక్కడపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, అధ్యక్షురాలు శ్రీరామ్ విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు.

### కళాహృదయులు డాక్టర్ వంశీ రామరాజు

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజుకు 'కళా సేవా జీవిత సాఫల్య పురస్కారం'తో సత్కరించి అభినందించే కార్యక్రమం తెలుగు కళాసమితి అధినేత తాతాజీ ఉసిరికల ఆధ్వర్యంలో (ఖతార్, దోహానగరం)లో జరిగింది. ఖతార్‌లోని భారత రాయబార కార్యాలయంలో రాజకీయ సమాచార వ్యవహారాల ప్రథమ కార్యదర్శి కుర్రీ పద్మ ముఖ్యఅతిథిగా హాజరై రామరాజుకు ఈ పురస్కారాన్ని అందించారు.

## ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి : డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



స్త్రీ మిత్ర ఫౌండేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, మే 2 ప్రభాతవార్త: పర్యావరణానికి, జీవరాసికి హానికరంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు నడుంబిగించాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వల్ల జరిగే నష్టాలు, అనార్థాలపై ప్రజలకు అవగాహణ కల్పించేందుకు స్త్రీ మిత్ర ఎన్జీవో ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను తార్నాకలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం స్త్రీ మిత్ర ఎన్జీవో అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ మనం వాడి పారవేసిన ప్లాస్టిక్ వస్తువులు తిని ఎన్నో మూగజీవులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం వల్ల చేపలు, అల్‌చిప్పలు ఇతర జీవులు తిని చనిపోతున్నాయన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వల్ల జరుగుతున్న నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ స్త్రీ మిత్ర ఎన్జీవో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, తీగుళ్ల రామేశ్వర్ గౌడ్,దోసోజు శ్రావణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పారిశుధ్య కార్మికులతో కలిసి సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త : పారిశుధ్య కార్మికులతో కలిసి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడే సందర్భంగా పారిశుధ్య కార్మికులకు రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచుతూ సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని పేర్కొన్నారు. పేదలందరికి అండగా నిలిచే కెసిఆర్ లాంటి నాయకుడు ఉండడం పారిశుధ్య కార్మికుల అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య క్షేమం కోసం పరిసరాల శుభ్రత కోసం అనునిత్యం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు బిఆర్ఎస్ ప్రభుత్వం సముచిత స్థానం కలిపిస్తోందన్నారు. బంగారు తెలంగాణగా మారుస్తున్న సిఎం కెసిఆర్ మరోసారి అధికారంలోకి రావాలని అన్నివర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్-దర్గా రోడ్డును వెంటనే పూర్తి చేయాలి : రంజిత్‌రెడ్డి




కిస్మత్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రంజిత్‌రెడ్డి

నార్సింగి, మే 2 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్-దర్గా రోడ్డును వెంటనే పూర్తి చేయాలని చేవెళ్ల ఎంపి జి.రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కిస్మత్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి మాట్లాడుతూ ప్రజలకు పాలకులు, అధికారులు జవాబుదారితనంతో పని చేయాలని సూచించారు. ఎందకు కిస్మత్‌పూర్-దర్గా పనులు ఆలస్యమవుతున్నాయని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తానని ఎంపి రంజిత్‌రెడ్డి స్థానిక ప్రజలకు హామీనిచ్చారు. వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజి పనులు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అధికారులు వెంటనే పూర్తి చేస్తారని తెలిపారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించిన ఎంపి రంజిత్‌రెడ్డి తీరుపట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రంజిత్‌రెడ్డి, నరేందర్, సంగారెడ్డి, దశరథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ డివిజన్‌లో మంచినీటిలో ప్రెషర్ సమస్యను పరిష్కరించాలి



జలమండలి జిఎం చంద్రశేఖర్‌కు కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్,బిజెపి నాయకులు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మే 2 ప్రభాతవార్త : అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాజేంద్రనగర్ జలమండి జిఎం చంద్రశేఖర్‌కు మంగళవారం అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ మాట్లాడుతూ పలు బస్తీలలో లోప్రెషర్ కారణంగా మంచి నీరు సరఫరా సక్రంగా జరగనందున తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని,సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం ముందు బిజెపి నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్,ఓబిసి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, బిజెపి సీనియర్ నాయకులు కడెం సుధాకర్,రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బాబూరావు,బిట్కూరి సిద్దేశ్వర్,కడెం మల్లేష్,వెంకట్‌రెడ్డి,విజయ్ స్వామి, స్టార్ చిన్న మనోహర్,రంజన్ జోషీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా నీరా స్టాల్స్ ఏర్పాటు చేయాలి

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: నేడు అందరి కృషి ఫలితంగా ప్రకృత పానీయం, ఆరోగ్యానికి ఉపయోగమైన నీరాను ప్రభుత్వం 'నీరా కేఫ్' పేరుతో ప్రారంభించడం అభినందనీయమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నీరా కేఫ్ ప్రారంభించడానికి కృషి చేసిన ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో నీరా పాలసీ అమలు చేయాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘాలతో పాటు వివిధ సంఘాలు, సంస్థలు, వ్యక్తులు ప్రచారం చేశారని, నీరా, పల్మేర్ ప్రొడ్యూసర్స్ డెవలప్‌మెంట్ సొసైటటీ, కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాల నుంచి ప్రదర్శనలు నిర్వహించి నీరా రుచి తెలంగాణ ప్రజలకు చూపించామన్నారు. నేడు అందరి కృషి ఫలితంగా ప్రకృతి పానీయం, ఆరోగ్యానికి ఉపయోగమైన నీరాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నదన్నారు. ఇది విజయవంతంగా నడవాలని, రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా నీరా స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్, బహుళజాతి కంపెనీల ప్రొడక్ట్స్‌ను తట్టుకొని నిలబడే విధంగా నీరాకు మార్కెట్ కలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీరా, తాటి ఈత ఉత్పత్తుల ద్వారా గౌడ యువతి, యువకులకు, గీత కార్మికులకు ఉపాధి కలిగే విధంగా చూడాలని కోరారు. బుధవారం ఉదయం నెక్లెస్‌రోడ్‌లో రాష్ట్ర మంత్రులు కెటిఆర్, డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్‌చే ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.

## త్యాగాలు ఉద్యమకారులు చేస్తే .. భోగాలు ఉద్యమ ద్రోహులు అనుభవిస్తారా..?

బిఆర్ఎస్ తెలంగాణ విద్యార్థి మహిళా విభాగం అధ్యక్షురాలు డా. దాత్రిక స్వప్న



ఒయు ఆర్ట్స్ కాలేజ్ ముందు మాట్లాడుతున్న డా. దాత్రిక స్వప్న

తార్నాక, మే 2 ప్రభాతవార్త: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నా తెలంగాణ ఉద్యమ కారిణిలకు సరైన గుర్తింపును ఇవ్వడంలేదని, ఓ.యూలో త్యాగాలను ఉద్యమకారులు చేస్తే భోగాలను ఉద్యమద్రోహులు అనుభవిస్తున్నారని బిఆర్ఎస్ తెలంగాణ విద్యార్థి మహిళా విభాగం అధ్యక్షురాలు డా. దాత్రిక స్వప్న తమ ఆవేదనను వెలుబుచ్చారు. మంగళవారం ఆమె తన తోటి ఉద్యమకారులతో కలిసి ఓ.యూలో ఉద్యమ కారుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాత్రిక స్వప్న మాట్లాడుతూ ఉద్యమ ద్రోహులు నేడు ప్రభుత్వంలో మంచి పదవుల్లో ఉన్నారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆనాటి ఉద్యమనేత సీఎం కేసీఆర్‌తో ఎన్నో ఉద్యమాలల్లో పాల్గొని కార్యక్రమాలను చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆయన సీఎం అయ్యారు సంతోషమే కాని నిజమైన ఉద్యమాలు చేసిన వారిని పూర్తిగా విస్మరించడం బాదకల్గిస్తుందన్నారు. తన వివాహానికి హాజరైన సీఎంకు తాము ఇప్పుడు గుర్తు రావడంలేదని తన బాదను వెలుబుచ్చారు. ఆయనను కలిసేందుకు కూడ అనుమతి రావడంలేదన్నారు.

పురుషులకు సమానంగా మహిళలు, విద్యార్థినులు ఉద్యమంలో పాలుపంచుకున్నారని ఆ సమయంలో సీఎం కేసీఆర్ ఎన్నో సార్లు తమ గురించి ఇదే విషయాన్ని చెప్పేవారని గుర్తు చేశారు. నేడు బారాసా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కావాలని పోరాడుతుందని రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన మహిళలకు సరైన ప్రాధాన్యత లేకపోవడం బాదకరమన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ ఉద్యమ కారులకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌డీ స్కాలర్ నేరెళ్ల పద్మ, నారమల్ల సుమలత, ఇంజమూరి నాగమణి,జక్కం ఉమ, డా.రేష్మ హుస్సేన్, ఏటి గడ్డ అరుణ, సునిత, ఝున్సీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని కలిసిన పవర్ ఇంజనీర్లు



మంత్రికి పుష్పగుచ్చం ఇచ్చి సత్కరిస్తున్న సదానందం, నారాయణ

హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త: భారతరాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరుతో నిర్మించిన సచివాలయం అద్భుతమైన కట్టడంగా పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అభివర్ణించింది. ఈమేరకు మంగళవారం నూతన సచివాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసోయేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సచివాలయం నిర్మాణం గొప్ప తనాన్ని జగదీశ్వర్‌రెడ్డితో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సదానందం, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్ నారాయణ, సెక్రటరీ జనప్రియ, పి.విరావు, సురేష్, భాస్కర్ ఆర్థిక కార్యదర్శి రాజు భాగయ్య, గోపాలకృష్ణ, గోపాలరావు, వెంకటేష్, ప్రశాంత్, కిరణ్, విద్యాసాగర్, మల్లయ్య,శివశంకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భరోసా సభను విజయవంతం చేద్దాం

షాబాద్, మే 2, ప్రభాతవార్త : ఈనెల 7న హైదరాబాద్‌లో సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ భరోసా సభను విజయవంతం చేద్దామని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షులు కర్రె శ్రీశైలం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ భరోసా సభ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, ప్రదీప్, మహేందర్, యాదయ్య, నవీన్‌కుమార్, నర్సింలు, శ్రీనివాస్, మల్లేష్, చందు తదితరులు ఉన్నారు.

## బిజెపి ప్రభుత్వం దోపిడీదారులకు అండగా నిలుస్తున్నది

సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను, రైతు చట్టాలను మార్చి దోపిడీదారులకు అండగా నిలబడి ఉత్పత్తి శక్తులకు సంకెళ్ల వేస్తున్నదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. ఆనేక విషయాలలో ఒకేదేశం, ఒకే విధానమని ప్రచారం చేస్తూ ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఒకే రకమైన శ్రమకు ఒకే రకమైన వేతనం కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఆధీనంలో శ్రమ చేస్తున్న వారికి ఎక్కువ వేతనాలు, రాష్ట్రంలో ఆదే శ్రమ చేస్తున్నవారికి తక్కువ వేతనాలు, ప్రైవేటు సంస్థలో ఆదే శ్రమ చేస్తున్నవారికి ఒకే వేతనం చెల్లించకపోవడం బిజెపి పరిభాషలో అన్యాయం కాదా అని నిలదీశారు.

## కార్మికులకు 1000 పెంచినందుకు కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు నెలకు 1000 రూపాయలు వేతనం పెంచుతూ సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి మంగళవారం నాడిక్కడ గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి పని చేస్తున్న కార్మికులకు సిఎం 1000 వేతనం పెంచడం శుభపరిణామమని, రాష్ట్రంలో ఆనేక సంక్షేమ పథకాలు చేపట్టి పేద ప్రజలకు తోడుగా ఉంటున్న ఏకైక వ్యక్తి కెసిఆర్ అని ఆమె కొనియాడారు.

## పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంను అందరూ సద్వినియోగం చేసుకోండి

**కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్**



పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మూసాపేట, మే 2, ప్రభాతవార్త : 124 డివిజన్ ఎల్లమ్మ బండ రైతు బజార్‌లో మంగళవారం తెలంగాన ప్రభువం పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం పేరుతో అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మబండ పరిధిలోని కెటిఆర్ కాలనీ, జయశంకర్ కాలనీ, గురుగోవింద్ సింగ్ నగర్, ఎన్టీఆర్ నగర్, గాంధీ నగర్, పాపమ్మ బస్తీ, పంచమి కాలనీ, హనుమాన్ నగర్ కాలనీలలోని సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అధికారులే మన దగ్గరికి వచ్చారు కాబట్టి కాలనీలో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఎటువంటి సమస్యలున్న వారి దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వర గా పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, సంగమేష్, మల్లేష్, ఖాజా, కైసర్ పాల్గొన్నారు.

## నృత్యకళాకారులకు అభినందన సత్కారం

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: సురభి అకాడమి ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అధినేత్రి సురభి శారద, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రపంచ నృత్యాంశాలను ప్రదర్శించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రీయ, జానపద పాశ్చత్య ఫ్యూజన్, జానపద, గిరిజన నృత్యాలను నర్తకులు ప్రదర్శించారు. అనంతరం వీరందరికి సేవారత్న పురస్కారాలను అందించి గౌరవించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మండడి కృష్ణారెడ్డి, ప్రత్యేక అతిథిగా. పిఎన్.మూర్తి, డాక్టర్ ఎం.లక్ష్మణాచార్యులు, ముదిగొండ జయశంకరప్రసాద్ హాజరై కళాకారులను అభినందించారు. పెద్దసంఖ్యలో కళాకారులు వివిధ నృత్యాలతో అందరిని అలరింపచేశారు.

## వరదనీటితో ఎన్ఎఫ్‌సీ కాలనీవాసులకు ఇక్కట్లు

ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార : ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో భారీవర్షాల కారణంగా వరదనీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2వ వార్డు పరిధిలో రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు పలు ఇళ్లలోకి ప్రవేశించి సామాన్లు తడిసిపోయాయి. డ్రైనేజీలో వరద సమస్యతో గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు వర్షం వస్తే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఈసమస్యపై ఆమె ఇటీవల మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిలిచిపోయి బురదనీరు ఇళ్లలోకి వస్తుండంతో మాన్‌హోల్ వద్ద జెట్ యంత్రంతో మట్టిని తొలగించి వాటర్‌ట్యాంకర్ ద్వారా శుభ్రం చేశారు. కౌన్సిలర్ రమాదేవి దగ్గరుండి పరిశుభ్రత పనులు చేయించారు.

## వెంచర్‌పై హెచ్ఎండిఎ కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ మక్తాలో చేస్తున్న వెంచర్ నిర్వహకులు నిబంధనలను పాటించడం లేదని పులకంటి రాజశేఖర్‌రెడ్డి హెచ్ఎండిఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చౌదరిగూడ సర్వేనంబర్ 879పార్ట్‌లో కౌసల్యనగర్ వద్ద నారాయణరావు చానల్ కాలువ పక్కన హెచ్ఎండిఏ లేఔట్ చేస్తున్నారని తెలిపారు. కాలువకు నిర్ణిత సెట్ బ్యాక్ లేకుండా బఫర్‌జోన్ పరిధిలో స్థలాన్ని ఆక్రమించి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కాలువ మీదుగా ఉన్న వంతెనను మూసి వేయడంతో గతంలో నుంచి ఉన్న పానాదిదారి లేక రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చౌదరిగూడ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికి ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘించి వెంచర్ చేస్తుండంతో హెచ్ఎండిఏ ఆదాయానికి గండి పడుతుందని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మోసపోతారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాజశేఖర్‌రెడ్డి కమీషనర్‌ను కోరారు.

## బిజెపి చొరవతోనే కంటోన్మెంటు రోడ్లు తెరిచారు

**కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్‌మెంబర్ జె.రామక్రిష్ణ**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, మే 2 ప్రభాతవార్త: ఆర్మీ ఏరియాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిల ఆదేశాలతోనే మూసి వేసిన రోడ్లను తిరిగి ఓపెన్ చేయడం జరిగిందని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్‌మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. మంగళవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్.కె. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మిలటరీ ఏరియాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఆర్మీ ఏరియాలో గతంలో రోడ్లను మూసి వేయడం జరిగిందని, దాంతో ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్ రెడ్డిల చొరవతోనే రోడ్లను ఓపెన్ చేయడం జరిగిందన్నారు.

**మానసిక క్షోభతో ఎమ్మెల్యేను చంపారు..** కంటోన్మెంట్‌లోని బిఆర్ఎస్ నేతలు కొందరు ఎమ్మెల్యే సాయన్ననుు మానసిక క్షోభకు గురి చేసి చంపారని బోర్డు సభ్యుడు రామక్రిష్ణ ఆరోపించారు. 5 సార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన దళిత ఎమ్మెల్యే అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరుపకుండా రాష్ట్ర మంత్రులు కుట్ర చేశారన్నారు. సాయన్న మృతి చెందిన తరువాత బిఆర్ఎస్ పార్టీలో 5 గ్రూపులుగా మారాయన్నారు. ఆర్మీ ఏరియాలోని రోడ్లను తాము ఓపెన్ చేయించామని ఫ్యాషన్ చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయానంద్, సతీష్‌కుమార్, మాదారపు అశోక్, శ్యామ్‌సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జ్ఞాన వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**



బండ్లగూడ జాగీర్ గంధంగూడ జ్ఞాన వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, మే 2 ప్రభాత వార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ గంధంగూడలో ఉన్న శ్రీశ్రీశ్రీ జ్ఞాన వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. వేద పండితుల మంత్రోచ్ఛ రణలు, మంగళ వాయిద్యాలు, వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య స్వామివారి క్రతువులన్నీ కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవన్నామ స్మరణం చేయడం వలన సర్వ పాపాలు తొలగిపోతాయన్నారు. కలియుగంలో దైవ నామంను జపించిన వారికి దేవుడు అండగా నిలుస్తాడని, ఇది యుగ ధర్మమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆలయాలకు వెళ్లే వారికి మానసిక, శారరీక రుగ్మతలన్నీ తొలగి, అహ్లాదం, ఆరోగ్యం పెరుగుతాయన్నారు. పెద్దలంతా ఆలయాలకు వెళ్లడంను దినచర్యలో భాగం చేసుకోవాలని, తమ బిడ్డలను వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్, కార్పోరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, సీనియర్ నేతలు పాపయ్య, గోపాల్, నాగరాజు, ఖాజా, యాదిరెడ్డి, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు గొప్ప పథకం కల్యాణలక్ష్మి, షాదీముబారక్

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్ మే 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి సిఎం కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గానికి చెందిన 80 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పు మొత్తం రూ.80,09,280 రూపాలయల కల్యాణలక్షీమ చెక్కులను అందించి ప్రసంగించారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిలు చేయడం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో సిఎం కెసిఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు కెసిఆర్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యనరకమంలో కార్పొరేటర్లు పద్మావెంకటరెడ్డి, వై.అమృత, తహశీల్దార్ లలిత ఆర్ఐ రాము, రెవెన్యూ సిబ్బంది, బిఆర్ఎస్, బిజెపి నేతలు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఫైజాన్ స్కూల్ రోడ్డును తెరువాలి : జంపనప్రతాప్



ఫైజాన్ స్కూల్‌కు రోడ్డు గేట్‌ను తెరవాలని సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్,మే 2 ప్రభాతవార్త: బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ఫైజాన్ స్కూల్ రోడ్ తెరువాలని కోరుతూ మంగళవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జంపన మాట్లాడుతూ గతంలో మూసి వేసిన రోడ్లను ఏ విధంగా తెరిచారో అదే విధంగా పెన్షన్‌లైన్ రోడ్డు నుంచి ఫైజాన్ స్కూల్‌కు వెళ్లే రోడ్డును కూడా తెరిచి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. 200 యేండ్ల సంవత్సరాల చరిత్ర కలిగిన ఫైజాల్ స్కూల్ రోడ్డుక చరిత్ర ఉందన్నారు. మజీద్‌కు ముస్లింలు ప్రార్ధనలు చేసుకునేందుకు ఈ మార్గం ఎంతో సులువుగా ఉందన్నారు. మూసి వేసిన ఫైజాన్ స్కూల్ రోడ్డును తిరిగి తెరువాలని సిఈఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షకీబ్, షిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సంఘసేవకురాలు పల్లెల సుశీల మృతి



నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: బంధ్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెల వీరస్వామి సతీమణి ప్రముఖ సంఘసేవకురాలు పల్లెల సుశీల తీవ్ర అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు నగరంలోని వీరస్వామి నివాసానికి చేరుకుని సుశీల మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు రైల్వే ట్రాఫిక్ ఎకౌంట్స్ మేనేజర్ సిరా శాంతిరాజు, ఐఆర్ఎస్ అధికారి కోటేశ్వరరావు, ప్రొఫెసర్ నతానియేలు, డాక్టర్ చీమా శ్రీనివాస్, ఎర్ర దేవదానం, ప్రొఫెసర్ ఏకు తిరుపతతి, న్యాయవాది మల్లన్న, రిటైర్డ్ ఎన్‌టిపిసి డీజీఎం ఆరెపల్లి రాజేందర్, దక్షిణమధ్యరైల్వే అసిస్టెంట్ చీఫ్ క్యాషియర్ అనీల్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు, ప్రొఫెసరులు, కవులు, స్నేహితులు, బంధులు సుశీల మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బంధువుల అశ్రునయనాల మధ్య డోర్నకల్‌లోని అమ్మపాలెం గ్రామంలో జరిగాయి. పల్లెల వీరస్వామికి ఎంతో తోడ్పాటును అందిస్తూ ముందుకు సాగిన గొప్ప మహిళ అని పలువురు కీర్తించారు.

## 937 మంది టీచర్లను కస్తూర్బాగాంధీ పాఠశాలల్లోకి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్**



విద్యా శాఖ మంత్రి కార్యాలయం ముట్టడిలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు తీర్పుప్రకారం 937 మంది కస్తూర్బాగాంధీ పాఠశాలల టీచర్లను కాంట్రాక్టు టీచర్లుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వందలాది మంది టీచర్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ నిరుద్యోగ జెఏసి చైర్మన్ నీల వెంకటేష్, జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ నాయకత్వంలో ఈ ముట్టడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2021 నవంబరు 17వ తేదీన ప్రభుత్వ నిబంధనల మేరకు కాంట్రాక్ట్ పద్దతిలో నియమించిన 937 మంది టీచర్స్ రెండు సంవత్సరాలుగా చిత్తశుద్ధితో ఇతర సిబ్బందితో సహా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాగా ప్రభుత్వం హఠాత్తుగా గత ఏడాది మార్చి 9న వీరిని, పిఇటిలను, ఏప్రిల్ 23న పిజి టీచర్స్‌ను, స్కూల్ టీచర్స్‌ను విధులకు హాజరుకావద్దని అధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. ప్రైవేటు పాఠశాలలో యాజమాన్యాలు టీచర్లను తొలగించడం లేదని, ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులు చదువుకునే పాఠశాలలో టీచర్లను తొలగించడం చూస్తుంటే ప్రభుత్వానికి విద్య పట్ల నిర్లక్ష్యవైఖరి కనిపిస్తున్నదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 937 మంది టీచర్లను విధుల్లో కొనసాగించాలని, వీరిని తొలగించి కొత్తవారిని నియమిస్తే కోర్టు తీర్పును దిక్కరించడమేనని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలలో ఖాళీగా వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు సి.రాజేందర్‌ముదిరాజ్, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ, అనంతయ్య, రేగుల మధుసూధన్‌రావు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నాయకులు గడ్డం సత్యనారాయణ పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

## అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం

చార్మినార్, మే 2 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని బిఆర్ఎస్ నాయకులు గడ్డం సత్యనారాయణ అన్నారు .ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు వెయ్యి రూపాయల వేతనం పెంచిన సందర్భంగా మంగళవారం ఆయన పలువురు పారిశుధ్య కార్మికులను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు రాపోలు బాలరాజు, జివిఎస్ రాం ప్రసాద్,మహావీర్ సింగ్, ఎన్.కిశోర్, కర్ణకోట సాత్విక్, ఎ.అశితోష్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్హులైన లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కుల పంపిణి



అర్హులైన లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు పావని వినయకుమార్, రచనశ్రీ

చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త: హిమాయత్ నగర్ తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గాంధీనగర్, కవాడీగూడలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కార్పొరేటర్లు ఎ.పావనీ వినయకుమార్, రచనశ్రీలతో కలిసి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ చంద్రకళ, బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బిజెపి నగర నాయకుడు ఎ.వినయకుమార్, బిఆర్ఎస్ నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముచ్చకుర్తి ప్రభాకర్, మన్నె దామోదర్‌రెడ్డి, పున్న సత్యనారాయణ, గడ్డమీది శ్రీనివాస్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో 58,59 జీవోలకు సంబంధించి అర్హులైన లబిదారులకు పట్టాలను కూడా పంపిణీ చేశారు.

## కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయకూడదు

షాబాద్, మే 2, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ముద్దెంగూడ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన ఎర్రోనిగూడ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## కాలనీలలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పార్కుల అభివృద్ధి



పార్కులోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, మే 2, ప్రభాతవార్త : కాలనీలలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మంగళవారం సనత్‌నగర్‌లో పర్యటించి 3.08 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎస్ఆర్‌టిలో 2 కోట్ల రూపాయల వ్యయంతో పునర్నించిన నెహ్రూ పార్కు మల్లీ జనరేషన్ థీమ్ పార్కును ప్రారంభించారు. అదేవిధంగా సుందర్‌నగర్‌లో 52.30లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాన పనులను, శ్యామలకుంటలోని జగ్గీజవన్‌రాం విగ్రహం వద్ద 8.40లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను, అల్లా ఉద్దీన్ కోటిలో 8లోలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం స్థానికులతో కలిసి మంత్రి పార్కు మొత్తం కలియతిరిగారుప. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కృష చేస్తున్నటర్లు తెలిపారు. పార్కును కాలనీ వాసులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. నియోజకవర్గం పరిధిలోనే అద్భుతమైన పార్కును ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. పార్కులో ఎలాంటి ఇతర కార్యకలాపాలకు అవకాశం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అద్భుతమైన పార్కును నిర్మించడం పట్ల మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. తన సమస్యలను తెలుసుకున్న వెంటనే వాటిని పరిష్కరించే నేత తమకు ఉండటం తమ అదృష్టమని పేర్కొన్నారు. అల్లాఉద్దీన్ కోటి పర్యటన సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. హెవీ వాహనాలు వస్తుండటం వలన తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్నొగా, అల్లా ఉద్దీన్ కోటి, లోధా ఆపార్ట్‌మెంట్ పక్క రోడ్లలో హెవీ వెహికల్స్ రాకుండా ఏర్పాటు చేయాలని జోనల్ కమీషనర్ రవికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. తమ బస్తీలో పలు చోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వాటిని తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికాఉలను ఆదేశించారు. సనత్‌నగర్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులను మరింత వేగవంతం చేయాలని, రోడ్డు విస్తరణలో భాగంగా ఆల్విన్ నుండి లోధా ఆపార్ట్‌మెంట్ అడ్డంకిగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సమస్యలను వెంట వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యమ్రకంలో కార్పోరేటర్ కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, జోనల్ కమీషనర్ రవికిరణ్, డిసి మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, టైన్‌ప్లానింగ్ ఏసిపి రమేష్, హార్టికల్చర్ డిడి శ్రీనివాస్, స్ట్రీట్ లైట్ డిఈ కిరణ్మయి, ఎలక్ట్రికల్ ఏడి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 2, ప్రభాతవార్త : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని (రెగ్యులరైజ్)చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు జిల్లాకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ధర్నాను కొనసాగిస్తున్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ముందు ఐదవ రోజున జూనియర్‌పంచాయతీ కార్యదర్శులు ధర్నా కొనసాగింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమితులై ప్రొబేషనరీ నాలుగేళ్ల పూర్తి అయినా ఇంత వరకు రెగ్యులరైజ్ చేయకపోవటం దారుణమని పలువురు జూనియర్ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర వ్యాప్తంగ సమ్మె చేస్తున్నందున ప్రభుత్వం సమస్యలను గుర్తించి పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మేడ్చల్ జిల్లాలో 61గ్రామపంచాయతీలు ఉండగ 30 గ్రామపంచాయతీల్లో ఓపీఎస్, జెపిఎస్ లే పనిచేస్తున్నారని అన్నారు. సమ్మెకు దిగటం వల్ల గ్రామాలలో సమస్యలు పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమితులై నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలపరిమితి కూడ పూర్తి జరిగినందున వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. గత నెల 28వ తేదీ నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. జిల్లా కలెక్టరేట్ వద్ద గత ఐదు రోజుల నుంచి ధర్నా చేస్తూ తమ నిరసనలు తెలుపుతూ సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ ఉన్నారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయాలని, విధి నిర్వాహణలో ఉండి మృతిచెందిన వారికి రూ.50లక్షలు ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.20లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. దీనిలో మేడ్చల్ జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు దేవేందర్, పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE CUM FAMILY COURT JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI**
**F.C.O.P. No. 755 OF 2021**

Between:
**Smt. Alekya Rathod**
Represented by GPA Holder Prem Kumar Rathod ...Petitioner
AND
**Gajjala Yashwanth Kumar** ...Respondent

To,
**Gajjala Yashwanth Kumar** S/o G. Pratap Kumar aged about 33 years, Occ: Private Service, R/o H.No. 4-194, MLR Colony, Dammaiguda, Keesara Mandal, Medchal-Malkajgiri Dist. Telangana. ...Respondent

**NOTICE**

Whereas the Petitioner above named has instituted a original petition under section 13(1)(I)(a) of Hindu Marriage Act for Divorce against you, and for that reason, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the petition on the **1st day of June, 2023,** at 10.30 a.m. to answer the claim.
Take notice that in default of your appearance the case/original petition will be heard and determined in your absence on merits.

//BY ORDER OF THE COURT//
**Sd/- M/s. Amarender Reddy, B. Anjan Kumar & Associates**
**Advocates**
Plot No.4, Sri Sai Nagar Colony, Kushaiguda, Hyderabad-500062.
**Ph: 9849116963**
**Advocate for Petitioner**



**PUBLIC NOTICE**

The General Public are hereby notified that one **Gunde Yadagiri S/o Gunde Venkataiah,** R/o 20-197/96/143, Gabbilala Peta, Balaji Nagar, Jawahar nagar, JJ Nagar, Rangareddy-500087 (Adhar No.3376 2891 8506) is unlawfully and illegally selling plots in Sy.No.284 at Jawaharnagar under Shameerpet Mandal (Now Kapra Mandal) on the pretext that he has purchased AC 05-00 Gts from Narinder Pal Singh (Advocate) S/o Late Moti Singh. The fact is that without observing the due process of law and without obtaining proper permission from Revenue authorities selling plots in Sy.No.284 at Jawaharnagar is unlawful and illegal. The General Public is hereby informed that I have not sold any land to above mentioned Gunde Yadagiri or collected any money from him, but he is luring the General public and sellin plots in Sy.No.284 by showing Xerox copies of documents. The General Public be aware Xerox copies of any Agreement or documents no one cannot become the owner of any land / property unless agreement holder fulfills the terms and conditions of the said Agreement and necessary entries be made in the Revenue Records. Therefore, if any member of the General Public enters with the sale transaction or purchase any plot from Gunde Yadagiri in Sy.No.284 at Jawaharnagar. Kapra Mandal will be doing so at his own risk. If any one from the general Public has any grievances on the above subject matter then is at liberty to approach the appropriate Court of Law with in one Week from the date of publication of this Notice under intimation to the undersign.

**Sd/- NARINDER PAL SINGH**
**S/o Late Moti Singh**
**Advocate**
H.No.18-39, MES Colony, Alwal, Secunderabad-500015,
**Cell No.9391328169**

# పేరుకుపోతున్న చెత్తతో ఇక్కట్లు

## ప్రాణ సంకటంగా మారిన వర్షాలు - విజృంభిస్తున్న దోమలు

## పడకేసిన పారిశుద్ధ్యం - పట్టించుకోని గ్రేటర్ అధికారులు

పేరుకుపోతున్న చెత్తతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మండు వేసవిలో భారీగా కురుస్తున్న వరాల కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. పలు కాలనీలు, బస్తీలలో పేరుకు పోయిన చెత్త వర్షం కారణంగా బురదమయంగా మారిన కాలనీలలో ఈగలు, దోమలు తిష్టవేసి ప్రాణసంకటంగా తయారయ్యాయి. పన్నులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ, పారిశుద్ధ్యంపై జిహెచ్ఎంసి అధికారులు పెట్టకపోవడం పట్ల కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త:** పేరుకుపోతున్న చెత్తతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మండు వేసవిలో భారీగా కురుస్తున్న వరాల కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. పలు కాలనీలు, బస్తీలలో పేరుకు పోయిన చెత్త వర్షం కారణంగా బురదమయంగా మారిన కాలనీలలో ఈగలు, దోమలు తిష్టవేసి ప్రాణసంకటంగా తయారయ్యాయి. పన్నులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ, పారిశుద్ధ్యంపై జిహెచ్ఎంసి అధికారులు పెట్టకపోవడం పట్ల కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్‌నగర్, నాగోల్ డివిజన్ల పరిధిలో చెత్తాచెదారం దర్శనం ఇస్తున్నాయి. కాలనీలలో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లలో పరిసర ప్రాంతాల వారు పెద్ద ఎత్తున చెత్తాచెదారం వేయడంతో ఆ ప్రాంతం పూర్తిగా దుర్వాసన వేస్తోంది. దీంతో దోమలు, క్రిమి కీటకాలు వ్యాప్తి చెందుతున్నాయి. వేసవి ఎండలు ముదురుతుండడంతో పేరుకుపోతున్న చెత్తలో ఈగలు దోమలు తిష్ట వేస్తున్నాయి. దీంతో దోమల బెడద తీవ్రరూపం దాలుస్తున్నాయి. దోమలు భారీగా వ్యాప్తి చెందుతుండడం తో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. దోమల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా కార ణంగా గతంలో శుభ్రతను పాటించినప్పటికీ ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం పరిపాటిగా మారింది. దీంతో క్రిమికీటకాలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం కూడా ఉంది. ఇటీవల కాలంలో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడంతో ఆరోగ్య పరిస్థితులు మరింత క్షీణించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ మహానగరం అందరికీ ఆదర్శంగా నిలవాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అనేకసార్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో మాత్రం ఆసక్తి కనబరచకపోవడం వల్లే చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయని స్థానికులు అంటున్నారు. సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించడం లేదని అధికారుల తీరు పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలలో ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు అధికార బృందం వచ్చి హడావిడి చేసి తర్వాత ఇటువైపు కూడా తొంగిచూడడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఓపెన్ ప్లాట్లు, కాలనీలలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే వారికి జరిమానా విధించాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రేపు నాగోల్‌లో దాసరి నారాయణరావు జయంతి ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** ప్రముఖ సినీ దర్శకుడు, నిర్మాత, రచయిత డాక్టర్ దాసరి నారాయణరావు 77వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆకృతి సంస్థ ఛైర్మన్ ఆకృతి సుధాకర్ తెలిపారు. నాగోల్‌లోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ ఛైర్మన్, ఉప్పల ఫౌండేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంపు కార్యాలయంవద్ద బుధవారం ఉదయం 9.30 గంటలకు దాసరి నారాయణరావు జయంతి ఉత్సవం జరుగుతుందని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమకు అనేక సేవలు అందించడంతో పాటు సందేశాత్మక చిత్రాలతో దశాబ్దాలపాటు దాసరి నారాయణరావు సినీ అభిమానులను ఆకట్టుకున్నారని తెలిపారు. దాసరి జయంతి ఉత్సవానికి ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త, విశిష్ట అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, ప్రముఖ సినీ దర్శకులు మహేష్‌చంద్, పి.సి.ఆదిత్య హాజరవుతున్నట్లు తెలిపారు. దాసరి జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## శ్రీసాయినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**నేరెడ్‌మెట్, మే 2 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దెల వెంకన్నగౌడ్ పేర్కొన్నారు. సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం భవనంలోఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బీ.పి, షుగర్, థైరాయిడ్ తదితర సమస్యలపై ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరు తమ ఉద్యోగంలో పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని తెలిపారు. నెలకు ఒక్కసారైనా ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు తప్పకుండా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్‌టి సెల్ అధ్యక్షురాలిగా అనిత నియామకం



అనితకు నియామక పత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

**సైదాబాద్, మే 2 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్‌టి సెల్ అధ్యక్షురాలిగా నేనావత్ అనితను నియమించారు. ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్య క్రమంలో చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, ఎల్‌బినగర్ ఎస్టీసెల్ అధ్యక్షుడు రమేష్‌నాయక్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుజాత, నాయకులు మతీన్ షరీఫ్, నారాయణ, యాదగిరి, కిరణ్, శివ, సరిత, యాదమ్మ భాగ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడలో ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని చారిత్రక శ్రీ మత్స్యావతార వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకుర్పారణ హోమం, అభిషేకం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడారోహణం, బలిహరణం తదితర పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామి వారి తిరుకళ్యాణం, శుక్రవారం రథోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. కాగా బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ పూజల్లో మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 7వ వార్డు గుర్రంగూడలో మంగళవారం జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, స్థానిక నాయకుడు జక్కిడి మధుసూదన్‌రెడ్డి తదితరులు (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## నిరుపేదలకు ఆపన్న హస్తం ఉప్పల ఫౌండేషన్ : చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** నిరుపేదల పక్షాన నిలుస్తూ వారికి ఉప్పల ఫౌండేషన్ ఆపన్న హస్తం అందిస్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ ఛైర్మన్, ఉప్పల ఫౌండేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో తట్టిఅన్నారం నిరుపేద కుటుంబానికి చెందిన నందిని వివాహానికి అవసరమైన మంగళసూత్రం, మెట్టెలు, చీరె, గాజులను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వధువు తల్లిదండ్రులు సంధ్య, శంకర్, ఆర్యవైశ్య నాయకులు రాజయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని అధికారులకు విజ్ఞప్తి : కార్పొరేటర్ పవన్

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటీ పవన్ కుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో అధ్వాన్న పరిస్థితిలోఉన్న డ్రైనేజీ వ్యవస్థను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజ్ లైన్ పూర్తిగా ధ్వంసమవ్వడంతో డ్రైనేజ్ మురికినీరు కాలనీలో పొంగిపొర్లుతున్నాయని జలమండలి అధికారుల తీర్పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం కారణంగా కాలనీవాసులు తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. డ్రైనేజీ సమస్యలకు సంబంధించి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారిపై ఒత్తిడి తీసుకు వచ్చి సమస్య త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కాలనీలలో పగిలిపోయిన మాన్‌హోల్‌లను వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు. దశాబ్దాల నాటి డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు జగదీశ్వర్ రెడ్డి, వెంకటేష్, జగన్, మైకేల్ రెడ్డి, శంకర్, బాలు, ఉమకాంత్, నాయకులు రమేష్ చారి, శివ చారి, కొత్త తిరుమల, గట్టు మహేష్ పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : గట్ల రవీంద్ర

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర కేజీ టు పీజీ స్టూడెంట్స్ పేరెంట్స్ అండ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ గట్ల రవీంద్ర (హైటెక్ రాము) పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ దారుణంగా తయారైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ విద్యా వ్యవస్థకు కొమ్ము కాస్తుండడం వల్లే ప్రభుత్వ విద్య పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో పేపర్ లీకేజీలు జరగడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్న నేటికీ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాఘవేంద్రనగర్‌లో బకెట్ యంత్రంతో డ్రైనేజీ క్లీనింగ్ చేయించిన కార్పొరేటర్



యంత్రంతో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్

**నాచారం, మే 2 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లో ఎక్కడ కూడ డ్రైనేజీ సమస్య లేకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటున్నామని నాచారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. వర్షపు నీటి సమస్య కారణంగా రాఘవేంద్రనగర్‌లో డ్రైనేజీ పైపులు నిండాయి. దీంతో వారు రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంతంతో ప్రత్యేక బకెట్ క్లీనింగ్ యంత్రం ద్వార డ్రైనేజీ పైపులను క్లీన్ చేయించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ లైన్లను జలమండలి సిబ్బందితో కార్పోరేటర్ క్లీన్ చేయించారు. ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటున్నామని కార్పోరేటర్ శాంతిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఇ లింగారావు, నాయకులు ముత్యంరెడ్డి, సత్తయ్య యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : ఎమ్మెల్యే బలాల



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

**మలక్‌పేట, మే 2 ప్రభాతవార్త :** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చావుని డివిజన్‌లోని మెరీన హోటల్ లేన్ ప్రాంతంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల సిసి రోడ్డు నిర్మాణ పనులు, సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పాదయాత్ర చేసి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేగవంతంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జున్, అహ్మద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ విజయలక్ష్మి



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి రాజు

**సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ పాలమూరి విజయలక్ష్మి రాజు డివిజన్ ప్రజలను కోరారు. డివిజన్‌లోని మీర్‌పేట్ జనప్రియా మహానగర్‌లోనున్న వార్డు కార్యాలయంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కంటి వెలుగు పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె కంటి వైద్య పరీక్షలను పరిశీలించి అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు గొప్ప అవకాశమని ఈ నేపథ్యంలో డివిజన్ ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలాపూర్ యుపిహెచ్‌సి వైద్యసిబ్బంది, డివిజన్‌లోని సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## పెండింగ్ వన్‌ర్యాంక్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని గవర్నర్‌కు వినతి

**నేరెడ్‌మెట్, మే 2 ప్రభాతవార్త :** డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అండ్ ఫ్యామిలీస్ వెల్ఫేర్ వాలంటరీ సొసైటీ అధ్యక్షులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికులతో కలసి రాజభవన్‌లో జరుగుతున్న మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్‌కు హాజరయ్యారు. అనంతరం వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమలు చేయాలని కోరుతూ గవర్నర్ తమిళిసైకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ఆర్మీ అధికారులతో పోల్చుకుంటే దాదాపు 90కి పైగా వ్యత్యాసం ఉందన్నారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ 1973 నుండి పెండింగ్‌లో ఉన్నటువంటి దానిని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 2014లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బార్డర్‌లో నిరంతరం కాపలా కాస్తున్న ఓఆర్, జెసిఓలలకు ఎటువంటి బెనిఫిట్స్ లేవని వారికోసం కొన్ని నెలలుగా జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ మాట్లాడుతూ పై అధికారులతో చర్చించి సమస్యను పరిష్కారం చేసే దిశగా కృషి చేసా _మన్నారు. ఈ కార్యక్రమంలో అవాడేష్ మిశ్రా, డీకె సింగ్, పెరుమాలజీ, ఎన్ సింగ్, కరుణాకర్ రెడ్డి, చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నిరుద్యోగ సభను విజయవంతం చేయాలి : రామ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** సరూర్‌నగర్‌లో నిర్వహించే నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి కోరారు. ఈ నెల 8వ తేదీన సరూర్‌నగర్ మైదానంలో తలపెట్టిన నిరుద్యోగ నిరసన సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మల్లు రవి ఆదేశాల మేరకు సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, ఫ్రంట్ చైర్మన్‌ల సమక్షంలో నిర్వహించామన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులను సమీకరించాలని, మొట్టమొదటిసారిగా తెలంగాణకు విచ్చేస్తున్న ప్రియాంకగాంధీకి ఘనస్వాగతం పలకాలని తెలంగాణ నిరుద్యోగులను కోరారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో తెలంగాణ నిరుద్యోగులు భాగస్వాములై నిరసన సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్, నర్సింహాయాదవ్, వేణుయాదవ్, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, మంజులరెడ్డి, సత్యనారాయణ, రమేష్‌నాయక్, రాజశేఖర్, సురేందర్ రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, మతిన్ షరీఫ్, మాక్సుద్, షరీఫ్, జానీబాబా, అరుణ్ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి: చింతల

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** డివిజన్లో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్‌లోని అయ్యప్పకాలనీ, హనుమాన్‌నగర్‌కాలనీ, మల్లికార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద తదితర ముండ్లను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అయ్యప్పకాలనీలో డ్రైనేజీ పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి, విద్యుత్తు, పారిశుద్ధ విభాగం, ఎంటమాలజీ, అర్బికల్చరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జలమండలి కార్యాలయంపై బిజెపి కార్పొరేటర్ల మెరుపు దాడులు



ఆందోళన చేస్తున్న కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త :** డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని నిరసన వ్యక్తం చేస్తూ ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంపై బిజెపి కార్పొరేటర్లు మంగళవారం మెరుపుదాడికి దిగారు. జలమండలి కమిషనర్ దాన కిషోర్ కార్యాలయంలోకి సరూర్‌నగర్, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్, పవన్‌కుమార్ దూసుకు వెళ్లారు. తమ డివిజన్లో డ్రైనేజ్ పనులు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని కార్పొరేటర్లు అధికారుల తీర్పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 50మీటర్లు,100మీటర్ల డ్రైనేజ్ పైప్‌లైన్‌లు కూడా మార్చడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ మురికినీరు త్రాగునీటిలో కలిసి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నోసార్లు జలమండలి అధికారులకు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయాన్ని ముట్టడించాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్, కమిషనర్ దానకిషోర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత : ఆర్ఐ

**జవహర్‌నగర్, మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో తమ వంతు కృషి చేస్తున్నామని కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌పరిధిలోని పలు సర్వే నెంబర్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించారు. సర్వే నంబర్లు 432 లో రోడ్డు ఆక్రమించి కొందరు కబ్జాదారులు రూమును నిర్మించారు. ఇట్టి విషయమై కాలనీవాసులు కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి నిర్మాణాన్ని కూల్చివేశారు. అలాగే సర్వే నెంబర్లు 265, 266 లలోని ప్రభుత్వ స్థలాల్లో వేసిన కంచను తొలగించారు. అనంతరం రెవిన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ కొంతమంది భూకబ్జాదారులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఫినిషింగ్ నిర్మాణం చేపట్టి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను అమ్మిన, కొన్న నేరమని, అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## యాప్రాల్ ప్రభుత్వ పాఠశాలలో వేసవి కాల క్రీడా శిబిరం ప్రారంభం



విద్యార్థులకు కిట్లను అందిస్తున్న కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, మే 2 ప్రభాతవార్త:** విద్యతోపాటు క్రీడల్లో సైతం విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాలని మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ ప్రభుత్వపాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవికాల క్రీడా శిబిరాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే విద్యతో పాటు పలు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం కబడ్డీ పోటీ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు పలు రకాల క్రీడలకు సంబంధించిన కిట్లను అందించారు. అంతేకాకుండా స్థానిక కాలనీ విద్యార్థులు ఈ వేసవి కాల క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డి, శివ, రమేష్, రాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

**సైదాబాద్, మే 2 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల వేతనాన్ని రూ.1000 చొప్పున పెంచుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ ఐఎస్‌సదన్ డివిజన్ మాజీకార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడిఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డితో పాటు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: హరిగౌడ్

**సైదాబాద్, మే 2 ప్రభాతవార్త:** అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి ఓబిసి మోర్చా మీడియా అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటను నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, రంగుమారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## యుసిడి సభ్యుల సేవలు ఎనలేనివి




యుసిడి సభ్యులను సన్మానిస్తున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణ తదితరులు

**మలక్‌పేట, మే 2 ప్రభాతవార్త :** యుసిడి సభ్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మినాజుద్దీన్, అలందార్ హుస్సేన్‌ఖాన్, సంఘ సేవకురాలు, సినీ నటి రూపాదేవి పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని బికె ఫంక్షన్‌హాల్‌లో బిఐసిసిఐ ఆధ్వర్యంలో కోర్ సభ్యుడు ఏపూరి కృష్ణమూర్తి యుసిడి సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా విచ్చేసిన వారు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో యుసిడి సభ్యులు అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. యుసిడి సభ్యులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారికి తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. అంతకుముందు యుసిడి సభ్యులకు వారు జ్ఞాపికలు అందించి సన్మానించారు. కోర్ సభ్యుడు ఏపూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ కొవిడ్ సమయంలో యుసిడి సభ్యులు అందించిన సేవలు అభినందనీయమని, బిఐసిసిఐ ఆధ్వర్యంలో యుసిడి సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమం ఎంతో మంది స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. అదే విధంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఐసిసిఐ అధ్యక్షుడు చెరాల నారాయణ, సమన్వయకర్త వినయ్, ప్రధాన కార్యదర్శి దాసరి కిరణ్, జనాధికార సమితి ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, సంఘ సేవకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.